క్లుప్తంగా

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న చేయూత సభ్యులు

డిండి : మండల కేంద్రానికి చెందిన నక్క లింగమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. డిండి యువత చేయూత ఆధ్వర్యంలో ఆదివారం మృతురాలి కుటుంబ సభ్యులకు రూ.10 వేలు ఆర్థికసాయంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో బి.శైలేష్, ఏటి.కృష్ణ, ఖయ్యూం, పి.దినేష్, అంజి తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ తరగతులను జయప్రదం చేయాలి



కరపత్రం ఆవిష్కరిస్తున్న కేవీపీఎస్ నాయకులు

వేములపల్లి : ఈనెల 26, 27 తేదీల్లో నల్లగొండలో నిర్వహించనున్న కేవీపీఎస్ జిల్లా స్థాయి సామాజిక శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు రెమడాల పరుశురాములు కోరారు. ఆదివారం మండలంలోని మొల్కపట్నం గ్రామంలోగల అంబేద్కర్ విగ్రహం వద్ద శిక్షణ తరగతుల కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్రంలో దళితులపై జరుగుతున్న దాడులను వ్యతిరేకిస్తూ ముందుకు సాగుతున్న ఏకైక సంఘం కేవీపీఎస్ అన్నారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా కమిటీ సభ్యులు శ్యామ్‌కుమార్, శైలజ, ప్రశాంత్‌కుమార్, వెంకటయ్య, వెంకన్న పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి జూలకంటి పరామర్శ



నాగేందర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జూలకంటి రంగారెడ్డి

వేములపల్లి : మండలంలోని మొల్కపట్నం గ్రామానికి చెందిన ప్రజానాట్య మండలి మాజీ రాష్ట్ర కమిటీ సభ్యులు జెర్రిపోతుల నాగేందర్ ఇటీవల మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి ఆదివారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, వైస్ ఎంపీపీ పాదూరి గోవర్ధని తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్



రక్షణ లేకుండా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

కొండమల్లేపల్లి : పట్టణ కేంద్రంలో మల్లేలగట్టు సమీపంలో రాష్ట్ర రహదారిని ఆనుకొని ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉంది. ఎలాంటి రక్షణ వలయం ఏర్పాటు చేయకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు, పాదాచారులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే రాష్ట్ర రహదారిపై ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు రక్షణ వలయం ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా తగిన చర్యలు చేపట్టాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

30వరకు ఉచిత ఆపరేషన్లు

నల్లగొండ టౌన్ : నల్లగొండ పట్టణంలోని ఐకాన్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్టు డాక్టర్ వై. శశేంద్ర ఆధ్వర్యంలో గ్యాస్ట్రో సమస్యలకు ఈ నెల 30 వరకు ఓపీ చూడటంతో పాటు ఆపరేషన్లు కూడా ఉచితంగా నిర్వహిస్తున్నామని ఆ ఆస్పత్రి నిర్వాహకులు డాక్టర్లు శశాంక్ కోడే, రవి శంకర్‌ఖన్నా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రోగులు కేవలం మందులు, రక్త పరీక్షలకు అయ్యే ఖర్చులు భరించాల్సి ఉంటుందని తెలిపారు. అతి తక్కువ ఖర్చుతో ఎండో స్కోపీ చేయబడుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అదృశ్యమైన మహిళ ఆచూకీ లభ్యం

గుర్రంపోడు : మండలంలోని తెరాటిగూడెంలో ఈ నెల 21న ఇంటి నుంచి బయటకు వెళ్లి అదృశ్యమైన కుసిరెడ్డి వెంకటనర్సమ్మ ఆచూకీ లభించింది. నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టు అన్నసత్రంలో భోజనం చేస్తుండగా గుర్తించిన వారు ఫోన్ చేసి కుటుంబ సభ్యులు సమాచారం అందించారు. వెంటనే వెళ్లి ఆమెను కుటుంబ సభ్యులు తీసుకొని వచ్చారు.

ఫలితమివ్వని 'బడిబాట'

- చాలా ప్రభుత్వ పాఠశాలల్లో పెరగని అడ్మిషన్లు
- గతేడాది 14 పాఠశాలలు బంద్
- సంఖ్య పెరగకుంటే మళ్లీ మూసివేత

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : ఇంగ్లీష్ మీడియంపై మక్కువతో తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలల్లో చదివిస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వ పాఠశాలల్లో చదివిస్తే తమను చులకనగా చూస్తారని చాలా మంది భావిస్తున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ప్రతి ఏటా తగ్గిపోతుండటంతో ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి ఏంటన్నది ప్రశ్నార్థకంగా మారింది. తిరుమలగిరి మండలంలో మొత్తం 52 పాఠశాలలు ఉన్నాయి. ఇందులో నాలుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ఐదు ప్రాథమికోన్నత పాఠశాలలు, 43 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. తిరుమలగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మినహాయిస్తే మిగతా మూడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఒక్కో పాఠశాలలో కనీసం 30 మంది కూడా లేని పరిస్థితి. యూపీఎస్ పాఠశాలలో గోడుమడక పాఠశాల తప్ప మిగతా నాలుగు పాఠశాలలో విద్యార్థుల సంఖ్య భాగానే ఉన్నప్పటికీ పీఎస్‌లలో విద్యార్థుల సంఖ్య ఘోరంగా ఉంది. చాలా పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పది కంటే కూడా తక్కువగా ఉంది. నెల్లికల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోగతేడాది కేవలం ఐదుగురు విద్యార్థులు మాత్రమే ఉండటంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ పాఠశాల మూసివేశారు. ఈ ఏడాది పదహేను మంది విద్యార్థులతో ఈ పాఠశాలను తిరిగి ప్రారంభించారు. చివరి వరకు ఆ విద్యార్థులు కూడా ఉంటారా?లేదా? మళ్లీ మూతబడేనా అనే పరిస్థితి నెలకొంది

గతేడాది 14 పాఠశాలలు మూత

గతేడాది విద్యార్థులు లేక మండలంలో 14 పాఠశాలలు మూతబడ్డాయి. వాటిలో తిరుమలగిరి ఎస్సీ కాలనీ, చెక్కోలంతండా, గాత్‌తండా, గట్టుమీదితండా, డొక్కలబావితండా, ఎర్రగట్టుతండా, అల్వాల తండా, నేతాపురం ప్రాథమికపాఠశాల, చౌటచెరువు, సఫావత్‌తండా, చెన్నయపాలెం, తిమ్మయపాలెం, ఇరికితండా, మూలతండా పాఠశాలలు ఉన్నాయి. మూతబడిన పాఠశాలల ఉపాధ్యాయులను ఇతర పాఠశాలలకు డిప్యూటేషన్‌పై పంపించారు. ఈ విద్యాసంవత్సరం ఈ పాఠశాలలను ప్రారంభించారు. ఈ విద్యా సంవత్సరం కూడా ఆ పాఠశాలలు మూతబడేలా ఉన్నాయి. వీటితో పాటు మండలంలో ఇంకా చాలా పాఠశాలలు పది మంది విద్యార్థుల కంటే తక్కువగా ఉన్న పాఠశాలలు ఉన్నాయి. దీనికితోడు ఉపాధ్యాయుల బదిలీలు ఉండటంతో మూతబడిన పాఠశాలల ఉపాధ్యాయులు ఇతర ప్రాంతాలకు వెళ్లడానికి ఆసక్తి చూపుతున్నారు. విద్యార్థులు లేక ఈ విధంగా కొనసాగితే ఉపాధ్యాయుల పోస్టులు శాశ్వతంగా రద్దయ్యే పరిస్థితితులు లేకపోలేదు. ఒక్కసారి పాఠశాలను మూసివేసినట్లయితే తిరిగి తెచ్చుకోవడం కష్టమని పలువురు ప్రజాప్రతినిధులు గ్రామస్తులకు, విద్యార్థుల తల్లిదండ్రులకు చెపుతున్నా వారిలో మార్పు కనిపించడం లేదు.



తిరుమలగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

బడిబాట పట్టని పంతుళ్లు

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య రోజురోజుకు తగ్గిపోతుండటంతో ప్రభుత్వం ఆచార్య జయశంకర్ సార్ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది. అసలే ప్రభుత్వ పాఠశాలలు కనుమరుగయ్యే పరిస్థితులు కొట్టొచ్చినట్టు కనపడుతున్నాయి. విద్యార్థుల సంఖ్యను పెంచి ప్రభుత్వ పాఠశాలలకు పూర్వవైభవం తీసుకురావాల్సిన ఉపాధ్యాయులు ప్రభుత్వం చేపట్టిన బడిబాట కార్యక్రమాన్ని పట్టించుకోలేదనే ఆరోపణలు వస్తున్నాయి. సంబంధిత ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం, ఉపాధ్యాయుల నిర్లక్ష్యం కారణంగా మండలంలో ఈ ఏడాది బడిబాట కార్యక్రమం ఆశించిన లక్ష్యాన్ని నెరవేర్చడంలో విఫలమైంది.



నెల్లికల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

పాఠశాలలను కాపాడుకుందాం



తల్లిదండ్రులు మీ పిల్లలను స్థానికంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలకే పంపించాలి. ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. గతేడాది మూతబడిన పాఠశాలలను ఈ ఏడాది తిరిగి పునఃప్రారంభించాం. ఆ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ఉపాధ్యాయులు, విద్యాశాఖ తీవ్రంగా శ్రమిస్తుంది. విద్యార్థుల సంఖ్య ఐదు కంటే తక్కువ ఉంటే ఆ పాఠశాలలు తిరిగి మూతబడే అవకాశం ఉంది.

– తరి రాము, ఎంఈఓ, తిరుమలగిరి

చెరువు శిఖం భూములను కాపాడుతాం

మిర్యాలగూడ : పట్టణ శివారులోని పందిర్లపల్లి చెరువుశిఖం భూములకు హద్దులు నిర్ణయించి కాపాడుతామని తహసీల్దార్ హరిబాబు తెలిపారు. ఆదివారం జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం డీఐ, ఐదుగురు సర్వేయర్లు, ఇద్దరు ఆర్ఐలు కలిసి సర్వే నిర్వహించారు. పట్టణ శివారులోని సర్వే నెం.118లో ఉన్న శిఖం భూములను గుర్తించి హద్దురాళ్లను పాతారు. సోమవారం యాద్గార్‌పల్లి శివారులో సర్వే నిర్వహించి హద్దురాళ్లు నిర్ణయిస్తామని తహసీల్దార్ తెలిపారు. పందిర్లపల్లి చెరువు భూముల ఆక్రమణలపై గత రెండు నెలలుగా పత్రికల్లో వస్తున్న కథనాలకు స్పందించి చెరువు శిఖం భూములను కాపాడేందుకు సర్వే నిర్వహించి హద్దులను నిర్ణయిస్తామని తెలిపారు. మండలంలో ఉన్న అన్ని చెరువు భూములను కాపాడుతామని, చెరువు భూములను కబ్జాచేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీఐ బాలాజీనాయక్, ఇరిగేషన్ ఏఈ విజయలక్ష్మీ, ఆర్ఐ రామకృష్ణ, సత్యనారాయణ, సర్వేయర్లు పాల్గొన్నారు.



పందిర్లపల్లి చెరువులో సర్వే చేస్తున్న అధికారులు

మంత్రి కోమటిరెడ్డికి వినతుల వెల్లువ



వినతిపత్రాలు తీసుకుంటున్న మంత్రి వెంకట్‌రెడ్డి



మంత్రికి సమస్యను విన్నవిస్తున్న బాధిత కుటుంబం

నల్లగొండ: రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి వివిధ సమస్యలపై ప్రజలు భారీ ఎత్తున వినతులు సమర్పించారు. ఆదివారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయ సమీపంలో గల పార్కులో ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. సమస్యలను విన్న మంత్రి ఫోన్‌లో పలువురు అధికారులతో మాట్లాడి ప్రజల సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. మరికొన్ని సమస్యలను అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పేద విద్యార్థుల చదువు కోసం మంత్రి ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాసరెడ్డి, వైస్ చైర్మన్ రమేష్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, జెడ్పీటీసీ లక్ష్మయ్య పాల్గొన్నారు.

క్యాన్సర్ బాధితురాలికి ఆర్థికసాయం

నల్లగొండలోని బోయవాడ ప్రాంతానికి చెందిన హరీష్ కూతురు లితికకు క్యాన్సర్ వ్యాధి సోకింది. 2వ స్టేజిలో ఉన్న క్యాన్సర్ చికిత్సకు డబ్బులు లేక వారు బాధపడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్ మంత్రి వెంకట్ రెడ్డికి ఆదివారం ఈ సమస్య విన్నవించారు. స్పందించిన మంత్రి వెంటనే రూ.50 వేలు బాధిత కుటుంబానికి అందజేశారు. చికిత్సకు అయ్యే మొత్తం ఖర్చు తాను భరిస్తానని మంత్రి హామీ ఇచ్చారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం



సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కొండమల్లేపల్లి : ఏక కాలంలో రూ.2లక్షల రుణమాఫీపై సీఎం రేవంత్‌రెడ్డి కేబినెట్ తీర్మానం చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు ఉట్కూరి వేమన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం కొండమల్లేపల్లి చౌరస్తా వద్ద సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. రూ.2లక్షల రుణమాఫీకి కేబినెట్ తీర్మాణం చేయడంపై దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ ఆదేశాల మేరకు సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నాయిని ప్రభాకర్‌రెడ్డి, కుంభం శ్రీనివాస్‌గౌడ్, గంధం సురేష్, అందుగుల ముత్యాలు, ముదావత్ మంగ్యానాయక్, రమావత్ లాలునాయక్, పిట్ట రామస్వామి, కొడిదాల వెంకటయ్య, వస్కుల శ్రీనివాస్, కందుల వెంకట్‌రెడ్డి, ఎలిమినేటి అజయ్, ఇస్లావత్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

25న వాహనాల వేలం

మిర్యాలగూడ అర్బన్ : వివిధ కేసుల్లో జప్తు చేయబడిన వాహనాలకు ఈనెల 25న వేలం వేయనున్నట్లు ఎక్సైజ్ పోలీసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 3ద్విచక్ర వాహనాలు, ఒక ఆటోను వేలం వేస్తున్నట్లు తెలిపారు. బహిరంగ వేలంలో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్నవారు మంగళవారం ఉదయం 11గంటలకు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

డీసీఎం డ్రైవర్స్ యూనియన్ కార్యాలయం ప్రారంభం



ఆఫీస్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ : పట్టణంలోని ఈదులగూడ చౌరస్తాలో మిర్యాలగూడ రైస్ మిల్ డీసీఎం డ్రైవర్స్ యూనియన్ కార్యాలయాన్ని ఆదివారం ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, కౌన్సిలర్ నర్సిరెడ్డి, మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు రవి, ఎంపీటీసీల ఫోరం ప్రధాన కార్యదర్శి సాయి, జోసెఫ్ పాల్గొన్నారు.

మండల స్థాయిలో ప్రజావాణి హర్షణీయం

నల్లగొండ టౌన్ : మండల స్థాయిలోనే ప్రజావాణి నిర్వహించాలని కలెక్టర్ నారాయణరెడ్డి నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కత్తుల జగన్‌కుమార్ అన్నారు. ఆదివారం అంబేద్కర్ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమస్యలను విన్నవించడానికి పేదలు దూర ప్రాంతాల నుంచి జిల్లా కేంద్రానికి రావడం వల్ల ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. కలెక్టర్ తీసుకున్న నిర్ణయంతో దూర ప్రాంతాల పేదలు వారి సమస్యలను మండల స్థాయిలోనే ప్రజావాణిలో విన్నవించి పరిష్కరించుకోవచ్చనే విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రజావాణికి దళిత సంఘాలు సహకారం అందిస్తాయని తెలిపారు. సమావేశంలో బాబు జగ్జీవన్‌రామ్ మెమోరియల్ జిల్లా సొసైటీ అధ్యక్షుడు కత్తుల షన్ముఖ కుమార్, ఎస్సీ సంక్షేమ సంఘం నాయకులు కత్తుల మహేశ్వర్, బీఎస్పీ నాయకులు వంటిపాక యాదగిరి, బొజ్జ నర్సింహ, పెరిక చిట్టిబాబు, పెరిక అంజి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కత్తుల జగన్‌కుమార్

శ్యామాప్రసాద్ ముఖర్జీని ఆదర్శంగా తీసుకోవాలి



మిర్యాలగూడ టౌన్ : శ్యామాప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు



దేవరకొండ : శ్యామాప్రసాద్ ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

దేవరకొండ : భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీని ప్రతీ ఒక్క బీజేపీ కార్యకర్త ఆదర్శంగా తీసుకోవాలని బీజేపీ దేవరకొండ పట్టణ అధ్యక్షుడు గుండాల అంజయ్య అన్నారు. ఆదివారం పట్టణంలో ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్‌ను బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దేశ సమైక్యత, సమగ్రతకు ప్రాణత్యాగం చేసిన గొప్ప వ్యక్తి శ్యామా ప్రసాద్ ముఖర్జీ అని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకూరి నర్సింహ్మ,జిల్లా కార్యదర్శి వసుల సుధాకర్,రెడ్డి శంకర్,ఉప్పల వెంకటేష్, గంప ఫణి, అర్ధం రమేష్, కాసుల శంకరయ్య, గంజి హరి, మాధవి, వలసాని వెంటటేష్, శేఖర్‌రెడ్డి, తదితరులున్నారు

శ్యామా ప్రసాద్ ముఖర్జీకి నివాళి

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో జన సంఘ్ వ్యవస్థాపకులు శ్యామా ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సాధినేని శ్రీనివాస్‌రావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు తుమ్మలపల్లి హన్మంతరెడ్డి, చిలుకూరి శ్యాం, జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు పురుషోత్తంరెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, జానకిరాం రెడ్డి, శేఖర్, లక్ష్మారెడ్డి, శ్రీను, బాషిపాక శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నీట్‌ను రద్దు చేయాలి



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న వక్తలు

మిర్యాలగూడ అర్బన్ : దేశ వ్యాప్తంగా నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించిన నీట్ పరీక్షలను రద్దు చేయాలని విద్యార్థి, యువజన, రాజకీయ పక్షాల నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో యూటీఎఫ్ సంఘం భవనంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో పలవురు వక్తలు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఎన్‌టీఏ, కేంద్ర ప్రభుత్వ, మానవ వనరుల శాఖ వైఖరిని తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు డి.గణేష్, శ్రీనివాసచారి, డాక్టర్ ముప్పా రామారావు, అంబటి నాగయ్య, వేణుగోపాల్‌రెడ్డి, రవినాక్ పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి

హుజూర్‌నగర్ : రైతుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు బచ్చు అశోక్‌కుమార్, నియోజకవర్గ అధ్యక్షుడు పులిచింతల అంజిరెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించిన కిసాన్ సెల్ సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలు అన్నింటినీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఒక్కొక్కటీ అమలు చేస్తుందన్నారు. దీనిలో భాగంగా గానే ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి రైతులకు రూ.2లక్షల రుణమాఫీ ప్రకటించారని పేర్కొన్నారు. రైతాంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని అన్నారు. సమావేశంలో కాంగ్రెస్ కిసాన్ సెల్ నాయకులు ఎం.మధుసూదన్‌రెడ్డి, సీహెచ్ నర్సిరెడ్డి, కోటయ్య, లక్ష్మీనారాయణరెడ్డి, కన్నయ్య, అరవింద్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన పీఆర్‌టీయూ నేతలు

మిర్యాలగూడ టౌన్ : ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతలకు అనుమతించి వేలాది మంది ఉపాధ్యాయుల హృదయాల్లో చెరగని ముద్రవేసుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డిని ఆదివారం పీఆర్‌టీ యూ–తెలంగాణ వ్యవస్థాపక అధ్యక్షులు గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి , రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు గార్లపాటి ఉమాకర్‌రెడ్డి, డాక్టర్ పర్వతి సత్యనారాయణ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. బాషా పండితులకు, వ్యయమ ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించిన సీఎంకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేడం జరుగుతుందని ఆ సంఘం నేతలు పేర్కొన్నారు. పదోన్నతులకు టీఈటీ పరీక్ష తప్పని సరి కాబట్టి సర్వీసులో మొత్తం పదోన్నతులు రావని ఆందోళన చెందుతున్న తరుణంలో ఎలాంటి ఆటంకం లేకుండా పదోన్నతులు కల్పించడం చాలా ఆనందంగా ఉందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన వారిలో సంఘం రాష్ట్ర నాయకులు శ్రీనివాస్‌రావు, వనం శ్రీనివాస్, జి. రవీందర్ గౌడ్, రాజు జాదవ్, గాదె లింగాస్వామి, జిల్లా కార్యదర్శి సూరనేని గంగాధరర్, వికారాబాద్ జిల్లా అధ్యక్షులు శ్రీశైలం తదితరులున్నారు.



సీఎం రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న పీఆర్‌టీయూ తెలంగాణ నేతలు

గుడిసెలు వేసుకున్న వారికి ఇళ్ల పట్టాలు ఇవ్వాలి

నల్లగొండ టౌన్ : నల్లగొండ పట్టణ పరిధిలోని గందంవారిగూడెం సర్వే నంబర్లు 556, 557, 580, 584,585లోని వెంకటరమణ కాలనీలో కొన్నేళ్ల క్రితం గుడిసెలు వేసుకున్న వారికి ఇళ్ల పట్టాలు ఇవ్వాలని సీపీఐ నియోజక వర్గ ఇన్‌చార్జి పబ్బు వీరస్వామి ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం స్థానికంగా జరిగిన పట్టణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో విశ్వనాథుల లెనిన్ బాబు, పుట్టం సుజాత, చిత్రంయాదగిరి, కోటి లింగం, ఎస్‌డి. నజీర్, గురవయ్య, రేణుక, కౌసల్య, విజయ, నుస్రత్, బి.జ్యోతి, పి.కళ్యాణి, రజిత, భవాని, సౌజన్య పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వీరస్వామి

ఆదర్శమూర్తి కోదాటి దశరథ



కోదాటి దశరథ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ : కోదాటి దశరథ అందరికి ఆదర్శమూర్తి అని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. ఆదివారం మిర్యాలగూడ మండలంలోని గోగువారిగూడెం గ్రామంలో కోదాటి దశరథ మూడో వర్ధంతి సందర్భంగా కుటుంబసభ్యులు ఏర్పాటు చేసిన విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగిగా పనిచేసి రిటైర్ అయిన తరువాత ఆల్ పెన్షనర్స్ యూనియన్ ఖమ్మం జిల్లా నాయకుడిగా సేవలు అందించిన దశరథ తన తుది శ్వాస వరకు నమ్మిన ఎర్రజెండా కోసం పనిచేశారన్నారు. తమ సొంత స్థలంలో విగ్రహాన్ని ఏర్పాటు చేయడమే కాకుండా గ్రామానికి నాలుగు గజాల స్థలాన్ని అంకితం చేయడంపై కుటుంబసభ్యులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో ఆల్ పెన్షనర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రంగయ్య, నాయకులు నాగేశ్వర్‌రావు, వీరభద్రం, గోపిచంద్, మల్లిఖార్జున్‌రావు, జనార్ధన్‌స్వామి, సురేష్, సాంబయ్య, వెంకటేశ్వర్‌రావు, మట్టయ్య, పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



హాలియా : సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు



పెద్దవూర : నాటి గురువులతో పూర్వ విద్యార్థులు

హాలియా : పట్టణంలోని నిర్మల ఉన్నత పాఠశాలలో 2003–04 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మల ఉన్నత పాఠశాలకు చెందిన పూర్వ గురువులు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత స్థానంలో గౌరవాన్ని పొందినప్పుడే ఉపాధ్యాయులకు గుర్తింపు లభిస్తుందన్నారు. అనంతరం పూర్వ విద్యార్థులు తమ గురువులు వెంకటేశ్వర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, రాములు, సత్య నారాయణ, డోమినక్, కమృద్దీన్, మేరీ రాణి సిస్టర్, రాజశ్రీ సిస్టర్‌లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రమేష్, నరేష్, మధుకర్‌రెడ్డి, కొండల్, ప్రభాకర్, రవి, కర్ణకర్, భవాని, మానస, రమ్య, దరణి, పద్మ తదితరులు ఉన్నారు.

సిద్ధార్థ విద్యానికేతన్‌లో..

పెద్దవూర : మండల కేంద్రంలోని సిద్ధార్థ విద్యానికేతన్ ఉన్నత పాఠశాలకు చెందిన 2004–2005 బ్యాచ్ పదవ తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం రాఘవేంద్ర ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. 20ఏళ్ల తర్వాత అంతా ఒకే వేదికపై కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. పూర్వ విద్యార్థులంతా కలిసి తమ అనుభవాలను, క్షేమ సమాచారాలను చర్చించుకున్నారు. తమకు విద్యాబుద్దులు నేర్పిన నాటి గురువులను పూలమాలలతో సత్కరించి శాలువాలతో సన్మానించి, జ్ఞాపికలను అందించారు. అనంతరం అంతా కలిసి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో నాటి గురువులు కర్ణ సైదిరెడ్డి, సలికంటి వెంకటయ్య, శ్రీనివాసచారి, పూర్వ విద్యార్థులు దారెడ్డి కొండల్‌రెడ్డి, మేకల వెంకటయ్య, విశ్వనాథం, ముని, సేవా, వెంకటేశ్వర్‌రెడ్డి, మమత, కల్పన, రాధ, వరలక్ష్మీ, మమత, అన్నపూర్ణ, రాంసింగ్, రాంబాబు, సంజీవరెడ్డి, రామచంద్రం, సత్యనారాయణ, కిషన్, కొండల్, మోతీలాల్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి

మాడుగులపల్లి : ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ తిరుమలస్వామి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజావాణిని నిర్వహించనున్నట్లు తెలిపారు. సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించేందుకు అన్నిశాఖల అధికారులు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. ఫిర్యాదుల పరిష్కారానికి యంత్రాంగం తక్షణ చర్యలు తీసుకుంటుందని ఎంపీడీఓ వెల్లడించారు.